క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక ఆగమ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష తులసి పుష్పాలతో అర్చన చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో మాధవీలత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వృద్ధులకు ఉచిత వైద్యసేవలు



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా వృద్ధాశ్రమం లోని వృద్ధులకు ఉచితవైద్య సేవలు అందించారు. స్థానిక బేతవోలులోని శాంతి వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం డాక్టర్ కె.జోగేశ్వరరావు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన మందులతో పాటు ఆరోగ్యాన్ని పెంపొందించే మాత్రలు, టానిక్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాద్, క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎల్ఈ వెంకటేశ్వరరావు, పొన్నూరు సత్యన్నారాయణ, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, మాజీ గవర్నర్ బొగ్గారపు తిరుపతయ్య, లింగం చిట్టిబాబు, కె.రామకృష్ణ, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత



తోట్లవల్లూరు: దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాల్సిన అవసరం ఉందని ఉయ్యూరు రోటరీక్లబ్ అధ్యక్షుడు సీహెచ్‌టీ వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన పి.పద్మారావుకి రోటరీక్లబ్ తరపున ట్రై సైకిల్‌ను ఆదివారం ఆయన అందజేశారు. రోటరీ ద్వారా ఉయ్యూరు పరిసర ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. రోటరీ కార్యదర్శి సీహెచ్ నాగసుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అనీస్, ఎస్.సంపత్‌కుమార్, పులి శ్రీనివాసరావు, టీ బ్రహ్మేశ్వరరావు, కే మస్తాన్‌రావు, చింతా రాజా, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన వంతెన



పామర్రు: మండల పరిధిలోని ఉరుటూరు గ్రామంలోని నాగులేరు కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. సుమారు 90 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన శ్లాబ్ పెచ్చులు ఊడి పోయి శిథిలమైంది. శ్లాబ్ భాగంలో పెచ్చులు ఊడిపోయి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. వంతెనపై ప్రయాణించేందు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వంతెనపై ప్రయాణించి గ్రామం నుంచి సత్యనారాయణపురం, నల్లగుంట, సాంఘిక సంక్షేమ గురుకులపాఠశాల తదితర గ్రామాల ప్రజలు ప్రతి రోజూ ప్రయాణం చేస్తూ ఉంటారు. గ్రామంలోని రైతులు తమకు సంబంధించిన సుమారు 200 ఎకరాల్లో పొలం పనులకు ఈ వంతెన మీదుగా వెళ్లాలి. శిథిలావస్థకు చేరిన ఈ వంతెనపై ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయం భయంగా ప్రయాణం సాగించాల్సి వస్తోందని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు స్పందించి భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ విజయ ఢంకా

- వణుదుర్రు సర్పంచ్ పదవి కైవసం
- సింగనపూడి వైఎస్సార్ సీపీ వార్డు ఏకగ్రీవం

కైకలూరు: పంచాయతీ ఉప ఎన్నికల్లో కై కలూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మరోమారు తన సత్తా చాటింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు ఓటు రూపంలో వణుదుర్రు సర్పంచ్‌ను గెలిపించుకున్నారు.

నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి నాలుగు మండలాల్లో ఒక్కో మండలంలో ఒక్కో వార్డు సభ్యులు, ముదినేపల్లి మండలం వణుదుర్రు పంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చింది. వార్డు సభ్యుల విషయంలో మండవల్లి మండలం సింగనపూడి 1వ వార్డు సభ్యుడు వడపు కృష్ణబాబు మరణించడంతో వైఎస్సార్ సీపీ తరుపున ఆయన భార్య సునీతతో నామినేషన్ వేయించారు. ఆమె ఎన్నిక ఏకగ్రీవమైంది. ముదినేపల్లి మండలం పెయ్యేరు గ్రామ 2వ వార్డు సభ్యుడు దుబా నాగేశ్వరరావు మరణించగా, ఈ స్థానంలో అతని భార్య దుబా నిర్మలను టీడీపీ మద్దతుతో బరిలో దించారు. మానవత దృక్పథంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి నామినేషన్‌ను విరమించుకున్నారు. దీంతో ఆమె ఏకగ్రీవంగా నిలించింది. మండవల్లి మండలం సింగనపూడి గ్రామ 1వ వార్డు సభ్యుడు వడపు కృష్ణబాబు మరణించడంతో వైఎస్సార్ సీపీ తరుపున ఆయన భార్య సునీత ఏకగ్రీవంగా ఎన్నికైంది. కలిదిండి వార్డు ఎన్నికల్లో స్వల్ప తేడాతో టీడీపీ గెలుపొందింది. సీతనపల్లి వార్డు ఎన్నికల్లో ముగ్గురు పిల్లల అడ్డంకితో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి బరి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

ఓటమి ఎరగని వణుదుర్రు ఎన్నిక

ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామ సర్పంచ్ ఎన్నిక రసవత్తరంగా మారింది. సర్పంచ్ చిన్నం అర్జునరావు మరణంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. అర్జునరావు బాబాయి చిన్నం సుగుణబాబును వైఎస్సార్ సీపీ రంగంలోకి దించింది. జనసేన పార్టీ నుంచి కొనాల రేవతి, టీడీపీ నుంచి తోట వెంకటేశ్వరరావు, స్వతంత్ర్య అభ్యర్థిగా చిన్నం వెంకటేశ్వరరావు బరిలో ఉన్నారు. వైఎస్సార్ సీపీ మద్దతు దారునికి 792, టీడీపీకి 348, జనసేనకు 168, స్వతంత్ర అభ్యర్థికి 03, నోటా ఓట్లు 2, చెల్లని ఓట్లు 31 నమోదయ్యాయి. వైఎస్సార్ సీపీ మద్దతు ఇచ్చిన సుగుణబాబుకు 444 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఎస్సీ సర్పంచ్‌గా సుగుణబాబు విజయంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.



సింగనపూడి వార్డు మెంబర్ సునీతకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారి

చక్రం తిప్పిన ఎమ్మెల్యే కుమారుడు

రాజకీయ చతురుడిగా పేరుగాంచిన ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కుమారుడు వినయ్ వణుదుర్రు ఎన్నికల్లో చక్రం తిప్పారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణతో కలసి గ్రామంలో అన్ని వర్గాల ప్రజలతో సమాలోచనలు చేశారు. పార్టీ మద్దతు ప్రకటించిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. దీంతో విజయం సులభం అయ్యింది. ఇదే కాకుండా గతంలో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ నియోజకవర్గంలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, ఎంపీపీల విజయంలో కీలకపాత్ర పోషించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లోకూడా ఇదే పరంపర కొనసాగుతోందని కార్యకర్తలు భావిస్తున్నారు.

గుడివాడ నియోజకవర్గం నందివాడ మండలం పుట్టగుంట పంచాయతీ 9వ వార్డు సభ్యురాలిగా ఏకగ్రీవమైన ఆర్ శివదుర్గాభవాని ఎన్నికయ్యారు. విజేతలను అభినందించారు.



అలినక్కిపల్లి 6వ వార్డు మెంబర్ షబానాజహా



పుట్టగుంట 9వ వార్డు మెంబర్ ఎస్‌డీ భవాని

వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయం

వెంట్రప్రగడ (పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ, పాములపాడు గ్రామాల్లో జరిగిన వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెంట్రప్రగడ 12వ వార్డు అభ్యర్థిగా గుర్విందపల్లి దయామణి, పాములపాడు 4వ వార్డు అభ్యర్థిగా నరదాల పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అభ్యర్థుల ఎన్నికల పట్ల ఎంపీపీ గోగం సురేష్, పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.



గుర్విందపల్లి దయామణి



నరదాల పద్మావతి

పూలవర్తిగూడెం అభివృద్ధి ఘనత ఎమ్మెల్యేదే

రూ.80 లక్షలతో 15 సీసీ రోడ్ల నిర్మాణం

పెదపారుపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ చొరవతో పూలవర్తిగూడెంలో సుమారు రూ.80 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్ అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలోని పూలవర్తి గూడెం అభివృద్ధిపై ఆదివారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పూలవర్తి గూడెంలో అంతర్గత రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. వర్షకాలం వస్తే అనేక ఇబ్బందులు పడేవాళ్లమన్నారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సమస్యను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లాగానే ఉపాధిహామీ నిధుల నుంచి సుమారు రూ.80 లక్షలతో 15 సీసీ రోడ్లు పూర్తి చేశామన్నారు. పూలవర్తి గూడెం అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్‌కే దక్కుతుందన్నారు.



పామర్రు ఏఎంసీ డైరెక్టర్ వరప్రసాద్

మెరుగైన సమాజమే లక్ష్యం

మండవల్లి: ప్రజలు చైతన్యవంతులై వారి సమస్యలు వారే పరిష్కరించుకునేలా ఉపయోగపడటమే ఐక్య వేదిక ఉద్దేశమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. ఆదివారం స్థానిక స్టేషన్‌రోడ్‌లోని టైప్ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం మండల అధ్యక్షుడు టి.అప్పారావు అధ్యక్షతన ఐక్యవేదిక మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ మెరుగైన సమాజానికి, మెరుగైన పౌరులను తయారుచేయడం, అంతేగాని ప్రజా సమస్యలను తీర్చిపెట్టేదిగా మన సంస్థ పనిచేయదని వేదిక సభ్యులు అందరూ గుర్తించాలన్నారు. భావజాలం కలిగిన, సమయం కేటాయించగలిగిన వ్యక్తులను వేదికలోనికి తీసుకోవాలన్నారు. ఏలూరు జిల్లా కమిటీ ఏర్పాటుకు కృషి చేయాల్సి ఉందని మండల అధ్యక్షుడు టి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి కె.మార్కురాజులు సూచించారు. పి.రామచంద్రరావు, బి.దివాకర్, జి.గణేష్, బి.రాముడు, బి.శివయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ భాస్కరరావు

పాటలతో ప్రజా చైతన్యానికి గద్దర్ కృషి

గుడివాడ టౌన్: ప్రజాగాయకుడు గద్దర్ మృతి కళాకారులకు, విప్లవకారులకు, జన చైతన్యానికి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తన గళంతో వేలాదిమందిని చైతన్యపర్చడంతో పాటు వారిలో సామాజిక విప్లవ భావాలను పెంచిన గొప్ప కళాకారుడు, సాహితీవేత్త గద్దర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి కార్యదిర్శ జి.మాల్యాద్రి, కె.గాంధీబాబు, వసుధ బసవేశ్వరరావు, అవిర్నేని వెంకటేశ్వరరావు, కొమ్ముల సురేష్, పీటర్, ఎస్.రాంబాబు, సాహిత్యాభిమానులు, కళాకారులు, కవులు పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా పశువైద్య శాఖాధికారి

గుడివాడ టౌన్: వర్షాకాలంలో గేదెలు, ఆవుల్లో గొంతువాపు వ్యాధి వ్యాపించే అవకాశాలు ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్య శాఖాధికారి డాక్టర్ ఎస్ఎంఏ దివాకర్ ఆదివారం తెలిపారు. ఈ వ్యాధి పాస్టురెల్లా మల్టోసిడా అనే బాక్టీరియా వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. గొంతుభాగంలో వాపు, జ్వరం, నోటివెంట సొంగపడటం, శ్వాసతీసుకునేటప్పుడు గురక శబ్దంరావడం వంటివి గమనించినప్పుడు అది గొంతువాపు వ్యాధిగా గుర్తించాలన్నారు. రక్త పరీక్షను బట్టి వ్యాధిని నిర్ధారించవచ్చన్నారు. ఒక పశువు నుంచి మరొక పశువుకు వ్యాధి వ్యాపించే అవకాశం ఉన్నందున వ్యాధి సోకిన పశువును మిగతా పశువులకు దూరంగా ఉంచాలన్నారు. సల్ఫాడీమిడిన్ 33.5 శాతం మందును సరానికి, ఆక్సీటెట్రాసైక్లిన్ ఇంజక్షన్ 20 ఎంఎల్, మెులానెక్స్ ఇంజక్షన్ 15 ఎంఎల్, యాంటి హిస్టామిన్ ఇంజక్షన్లు కండకు మూడు రోజులు ఇస్తే వ్యాధి నయమవుతుందన్నారు. పశువులకు ఈ నెలల్లో ఈ వ్యాధిసోకే అవకాశాలు మెండుగా ఉన్నాయని రైతులు ఈ జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న డాక్టర్ దివాకర్

గంగానమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే

మండవల్లి: మండలంలోని భైరవపట్నం గ్రామానికి చెందిన కొమ్మన సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన గంగానమ్మ సంబరంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆదివారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే తొలుత అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నాగదాసి కిరీటిరాజు, గుడివాడ బాలాజీరావు, గాదిరాజు భాస్కరరాజు, గుడివాడ శ్యామ్, కూనాబత్తుల రాంబాబు, బేతాల రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.



గంగానమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

రేపు శాంతి ర్యాలీ

పామర్రు: మానవత సేవా సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పామర్రు మానవత ప్రెసిడెంట్ ఐవీఎస్ మనోహర్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆరోజు ఉదయం 10 గంటలకు పామర్రు గ్రామంలోని అంకమ్మతల్లి దేవాలయం ఆవరణలో మానవత ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తామన్నారు. స్థానిక ప్రతాప్ కాలేజీ నుంచి శాంతి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. అదే రోజున ఐదురు రైతులకు ఎరువులు, పురుగు మందులను దాత కర్రై శ్రీధర్ సౌజన్యంతో అందజేస్తామన్నారు. మహిళలకు చీరలను పంపిణీ చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమాలకు మానవత సభ్యులు అందరూ తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

సాగరతీరంలో మెరైన్ గస్తీ



కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ముమ్మర గస్తీ నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు పెద్ద సంఖ్యలో సాగర తీరానికి తరలివచ్చారు. పర్యాటకులు సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. యువకులు బీచ్‌లో పలు విన్యాసాలు చేస్తూ ఆకట్టుకున్నారు. మెరైన్ పోలీసులు పర్యాటకులకు సముద్ర స్థితిగతులపై అవగాహన కల్పించారు. పర్యాటకులు సముద్రంలో లోపలికి వెళ్లకుండా లౌడ్‌స్పీకర్ల ద్వారా అప్రమత్తం చేశారు. మెరైన్ సీఐ పవన్‌కిషోర్ పర్యవేక్షణలో ఎస్ఐ జిలానీ, రైటర్ రెహ్మాన్ జానీ, సిబ్బంది గస్తీలో పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల కల్యాణ మండపంలో మార్పు ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో వెంట్రప్రగడ, వానపాముల, జమిదింటకుర్రు తదితర గ్రామాల నుంచి సుమారు 150 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ట్రస్టు సభ్యులు రావూరి సాధిక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ట్రస్టు ద్వారా ఉచిత వైద్య సేవలు అందించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ట్రస్టు సభ్యులు రావూరి చునావ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాక తీరం.. ఆహ్లాదభరితం...



ఆటపాక పక్షుల కేంద్రంలో బోటు షికారు



ఆటపాక పార్కు వద్ద చిన్నారుల సందడి

పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి

కైకలూరు: విదేశీ, స్వదేశీ పక్షుల కిలకిలరావాలతో కళకళలాడుతున్న ఆటపాక పక్షుల విహార కేంద్రాన్ని పర్యాటకులు పెద్ద ఎత్తున ఆదివారం సందర్శించారు. ఏలూరు, పశ్చిమ, తూర్పుగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి యాత్రికులు వచ్చారు. బోటు షికారు చేస్తూ పక్షుల అందాలను తిలకించారు. అనంతరం పక్షి నమూనా మ్యూజియంను తిలకించారు. సమీపంలో చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు సందడి చేశారు. అటవీ శాఖ సిబ్బంది సురేష్, సత్యనారాయణ పర్యాటకులకు కొల్లేరు పక్షుల విశేషాలు, నైసర్గిక స్వరూపం, ప్రజల జీవన పరిస్థితులు వివరించారు.

కార్తికేయుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం భక్తులతో కళకళలాడింది. శ్రావణ మాసం, సెలవుదినం ఆదివారం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఎటుచూసినా భక్తులతో నిండిపోయింది. క్యూలైన్లు అన్నీ భక్తులతో బారులు తీరాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నాగపుట్టలో పాలు పోస్తున్న భక్తులు

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ కౌశల్ యోజన పథకాన్ని స్వాగతిస్తున్నామని విశ్వకర్మ కౌశల్ జిల్లా కన్వీనర్ గానుగుల రాజా అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం నరేంద్ర మోడీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ఈనెల 15న విశ్వకర్మ కౌశల్ పథకం ద్వారా రూ.13 వేల కోట్లు సామాజిక అభివృద్ధికి కేటాయించడం, 18 రకాల చేతివృత్తిదారులకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణం మంజూరుకు అవకాశం కల్పించారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ బడుగు వర్గాల అభ్యున్నతికి నరేంద్రమోడీ చూపుతున్న చొరవ అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎర్రపోతు అర్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, అశోక్‌కుమార్, ఎం సత్యన్నారాయణ, డి సురేంద్ర, చందు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

90 మందికి దంత పరీక్షలు



తోట్లవల్లూరు: దంత సంరక్షణతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని దంత వైద్య నిపుణుడు డాక్టర్ వణుకూరు ప్రవీణ్ తెలిపారు. మండలంలోని రొయ్యూరులో గోసాలకు చెందిన జేడీ డెంటల్ క్లినిక్ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ అనూష, డాక్టర్ హథస్నా 90 మందికి దంత పరీక్షలు చేశారు. 30 మందికి పుచ్చు పళ్లను తొలగించి అవసరమైన మందులను అందజేశారు. శిబిరాన్ని హాస్పిటల్ మేనేజర్ కుందేటి సాంబశివరావు పర్యవేక్షించారు.

కైకలూరు టౌన్ ఎస్‌ఐగా ప్రతాప్‌రెడ్డి



కైకలూరు: కైకలూరు టౌన్ ఎస్‌ఐగా కల్లూరి ప్రతాప్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఏలూరు క్రైం బ్యూరో నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణను నివాసగృహాల వద్ద వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల నిర్వహణలో ప్రజలు, పోలీసులు కలసి పనిచేద్దామని నూతన ఎస్‌ఐ చెప్పారు.

ఎల్ఈఎఫ్ వార్షికోత్సవం

మచిలీపట్నంటౌన్: నగరంలోని మల్కాపట్నం ఎల్ఈఎఫ్ 88వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో క్రైస్తవులు ఆవిర్భావ ఆరాధన నిర్వహించారు. చర్చి పాస్టర్ తంటేపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవుని యందు భయం కలిగి జీవించటం వల్ల అనేక విషయాల్లో విజయం సాధించగలుగుతారన్నారు. తద్వారా సమాజంలో శాంతి, సంతోషం, సమాధానం వెల్లివిరుస్తాయని చెప్పారు. ప్రజలు క్రీస్తు మార్గంలో పయనించాలనే సదుద్దేశంతో 1935వ సంవత్సరంలో ఈ సంస్థను చెన్నైలో స్థాపించామని వివరించారు. కార్యక్రమంలో బ్రదర్ సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీస్తు గీతాలను ఆలపించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



